సగం తెరిచిన తలుపు

ఉత్తుంగ శిఖరాల కెగబాకి, ఆనందాల అకాశాల్లో విహరించి, జలపాత జ్వాలల్లో తడిసి, మైమరిచి పరవశించే సమయాన, రెండు శరీరాలు ఒకే రాగ సంగమంలో రవళించాల్సిన సమయాన ఎక్కడో అపశ్రుతి. భార్య కళ్ళల్లో బాధ. లీలగా, ఇష్టం లేనితనం.

“సారీ లలితా! నా ఆవేశంలో...’

“పోనీ లెండి” లలిత పెదాల మీద పేలవమైన చిరునవ్వు. అతను తన మనస్సునర్థం చేసుకోని సందర్భాలు ఎన్ని లేవు?

పక్కకు ఒత్తిగిల్లిన రామకృష్ణ మనస్సులో పశ్చాత్తాపం. ఆపైన రకరకాల ఆలోచనలు. ఇరవయ్యేళ్ల సంసారంలో ఎప్పుడూ పెద్దగా ఒడిదుడుకులు లేవు. లలిత అనుకూలవతే. అయితే పై స్థాయి కుటుంబం నుంచి వచ్చిందామె. ఒక పత్రికలో ఉద్యోగి భార్యగా ఆర్థికస్థితి తగ్గిపోయింది.

తీరని కొన్ని కోరికలు. మెల్లగా ఆమె తనలోకి తను నిర్లిప్తంగా ముడుచుకు పోయింది. ముకుళిత పుష్పాన్ని వికసింపజేయటం రామకృష్ణకి తెలీలేదు. నర్మద పుట్టిన తర్వాతైనా ఇద్దరి మధ్యా అదృశ్యదూరం పూర్తిగా తగ్గలేదు. పల్లెటూరు వదలి నగరంలో స్థిరపడిన తర్వాత ఎవరో తన జీవితాన్ని ఎటూ బెసక్కుండా చట్రంలో బిగించినట్టయ్యింది. బాల్యంలోని తాజాదనం, యౌవనంలోని చురుకుదనం మెల్లమెల్లగా ఇగిరిపోవటం చాన్నాళ్లదాకా గుర్తించలేదు రామకృష్ణ. గుర్తించిన తర్వాత తీరని అశాంతి మిగిలింది. ఒకటే ఇరుకు, బ్రతుకులో. ఇద్దరి కలయిక లోను ఏదో తెలీని అసంతృప్తి.

ఏ పన్నెండింటికో నిద్ర పట్టింది. నిద్రలో కల. కొన్నాళ్లనుంచి విడవకుండా వెంటాడుతున్న కల. హాంటింగ్ డ్రీమ్. సమ్‌వాట్ మిస్టీరియస్. భయంకరమూ కాదు; ఆహ్లాద కరమూ కాదు.

ఒక్క గది. కిటికీలు లేని గది. సగం తెరిచిన తలుపు. లోపల ఏముందో తెలీదు. కనుచీకటి. తలుపు పూర్తిగా తెరవటానికి సంకోచం. లోపల అడుగెయ్యటానికి బెరుకు. లోపల మనిషిని చూడాలనివున్నా సాధ్యం కాదు. తలుపు బిగుసుకుపోయి వుంటుంది. ఎంతకీ వెలుతురు రాదు. లోపలి వ్యక్తి కన్పించడు. చిత్రమైన కల.

హైదరాబాద్ నగరంలో ఒకానొక దినపత్రికలో చీఫ్ సబ్-ఎడిటర్ ఉద్యోగం వల్ల రామకృష్ణ తన జీవితంలో వ్యాకోచించాడా సంకోచించాడా అంటే రెండోదే నిజం. ఎవరి కోసమో పనిచేస్తున్నట్టు, ఎప్పుడూ ఏదో కనపడని కన్ను చాటుగా తనని పరీక్షిస్తున్నట్టు, భద్రత లేనట్టు అన్పిస్తుంది. పత్రికలో ప్రతి ఆదివారం వచ్చే 'రచన' శీర్షిక చూడడం తన ముఖ్యమైన పని. సాహిత్య వ్యాసాలు, కవితల వంటివి చూసి ఎన్నిక చెయ్యటం తనకిష్టమైన సంగతే. కానీ ఆ పనిలో పొందాల్సినంత సంతృప్తి పొందలేదు. అబద్ధాలు, దుష్ప్రచారాలు. ఆశ్రయించటాలు - చాలా దౌర్భాగ్యాలు నిండిన పత్రిక వాతావరణంలో రామకృష్ణ మనస్సు కుంచించుకుపోయింది.

"ఏమిటిది రామకృష్ణా! సాహిత్యం పేజీ ఇట్లాగేనా నిర్వహించటం? పత్తిరైతుల ఆత్మహత్యల మీద ఇది రెండో కవిత నువ్వు వెయ్యటం" ఎడిటర్ మందలింపు.

"అవును సర్! రైతుల ఆత్మహత్యల మీద దాదాపు పది కవితలు డెస్కులో ఉన్నాయ్. ఇప్పటికి మూడొందల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. బర్నింగ్ ప్రాబ్లమ్ కదాని..."

ఎడిటర్ ఒక అజ్ఞానిని చూసిన విజ్ఞానిలా నవ్వి "ఎలక్షన్స్ బర్నింగ్ ప్రాబ్లమ్ కాదా? మరి వాటి మీదెందుకు కవితలు వెయ్యలేదు?" అని ప్రశ్నించాడు.

"వాటి మీద ఎలాంటి కవితలు రాలేదు" లోలోపల చిరాకు అణుచుకుంటూ చెప్పాడు. ఎడిటర్ సుబ్రహ్మణ్యం బట్టతల మీద ఒక్కటిచ్చుకుంటే ఎంత బాగుంటుంది! కానీ బాగోదు.

"ఊహూ" అంటూ తలూపి పెండింగ్‌లో ఉన్న కవితల ఫైలు తెమ్మన్నాడు ఎడిటర్. అతనికి రామకృష్ణ మీద అసహనం కలగటానికి కారణం వేరు. ఆ రోజు ఉదయం సుప్రసిద్ధ కవి గుమ్మడి వేణుగోపాలరావు నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. ఎన్నో అవార్డులు. రివార్డులు పొంది చాలాకాలం నుండి ఆ కీర్తి మీద నెట్టుకొస్తున్న కవి. మాటామంతీ అయినతర్వాత 'మన' పత్రికలో తన కవితలు వెయ్యటం లేదేమిటని మామూలుగానే అడిగాడు. సుబ్రహ్మణ్యం నొచ్చుకున్నాడు. అతను మంచి 'పలుకుబడి' వున్న కవి. (కవిత్వంలో కాదు). కవిత కన్నా మనిషి ముఖ్యం.

రామకృష్ణ తెచ్చిన ఫైల్లోంచి వేణుగోపాలరావు కవిత, అనుమానపడకుండా ఉండటానికి మరో కవి కవిత బయటికి తీశాడు. అంత బాగున్న కవితలు అంతకాలం పెండింగ్‌లో పెట్టడం బాగోలేదని, తర్వాత వారం వచ్చేట్టు వాటిని వెంటనే కంపోజింగ్‌కి పంపించమనీ చెప్పాడు. చివరగా "అసలు నీకు 'రచన' శీర్షిక తగింది కాదోయ్! 'జనపదం'కి మార్చమంటావా? హాయిగా ఆవుపాడీ, పంట తెగుళ్లూ చూసుకుంటూ ఉండొచ్చు" అన్నాడు నవ్వులో వెటకారం ధ్వనింపజేస్తూ.

ఎడిటర్ వెటకారానికి తన తిరస్కారం తెలియజేద్దామనే ఆలోచన మానుకొని బయటికొచ్చాడు రామకృష్ణ అతనికి బదులివ్వటం ఎంతసేపు? కానీ ఉద్యోగంతో పని. మేనేజ్‌మెంట్ దగ్గర అతని మాటే చెల్లుబాటు అవుతుండటం చేతనే అంత దర్పం. ఏమీ చెయ్యలేని అసహనం. పెట్టుబడి గుప్పెట్లో చిక్కుపడ్డ బ్రతుకు. తన కుర్చీ దగ్గరకొస్తుంటే సబ్ ఎడిటర్ కె.ఎస్. రావు కనీ కనబడని నవ్వుతో ఓరగా చూశాడు. ఎడిటర్‌కి కావాల్సిన మనిషి. ఎప్పుడో తన స్థానంలోకి అతనొచ్చినా ఆశ్చర్యం ఉండదు. ఫైలు తీసి వేణుగోపాలరావు కవిత రెండు వాక్యాలు చదివాడు.

పండాలి ప్రతి హృదయంలో మమత
చైతన్యం చివ్వున శిరసెత్తితే
పల్లవిస్తుంది చల్లగా సమత'

మూడు దశాబ్దాల నాటి బాణీ. అంత్యప్రాసలు. ఏళ్ల తరబడి కవులు వాడీ వాడీ అరిగిపోయిన మాటలు. అవి ఇవ్వాళ్టి పాఠకుడిలో ఏ స్పందన కల్గించగలవు? కొత్తగా కలంపట్టిన కవులుకూడా మెరుపులు మెరిపిస్తున్నారివాళ. ఆఫ్టరాల్ 'పొగ పొయ్యి' మీద అద్భుతమైన కవిత రాశాడు యస్వీ రామిరెడ్డి. యౌవనోదయాన్ని వర్ణిస్తూ 'దేహద్వారాలు తెరిచారెవరో' అని శ్రీకాంత్ రాసినప్పుడు ఒళ్లు పులకరించింది. కవిత్వమల్లకపోయినా చదివి ఆనందించగలడు. ఇప్పుడీ రెండో కవితలో 'మనిషి వస్తువుకింద పడి మరణించాడు' (నన్నపనేని రవి) అనేది ఎంత పదునైన అభివ్యక్తి!

ఆఫీసు కుర్రాడు వచ్చి, రెండు ఉత్తరాలు టేబుల్ మీద పెట్టి వెళ్లాడు. ఒకటి శుభలేఖ. తాటి వెంకట్రావు కొడుకు పెళ్లి. తుళ్లూరులో. తప్పకుండా రమ్మని విడిగా ఉత్తరం కూడా రాశాడు. పాతికేళ్ల కిందట తను, వెంకట్రావు. ఇంకొంతమంది పిల్లలు నెక్కల్లు నుంచి రోజూ పొలాల గట్ల వెంట మూడున్నర మైళ్ల దూరం నడిచి తుళ్లూరు హైస్కూల్లో చదువుకున్నారు. తనకన్నా రెండు

క్లాసులు సీనియర్ వెంకట్రావు. చాలా స్నేహంగా ఉండేవాడు. అప్పుడే ఎంత కాలం గడిచిపోయింది? వాడిప్పటికీ తనని గుర్తుంచుకున్నాడు. ఈ నగరంలో ఇన్నేళ్లున్నా ఎవరూ తనని గుర్తుపట్టరు. అయితే వాడి ఉత్తరంలోని చివరి మాటలు బాధపెట్టాయి. "మీ తమ్ముడి ఆరోగ్యం బాగుండలా. నువ్వు నెక్కల్లు వస్తే వాణ్ణి చూసినట్టూ వుంటది. ఇక్కణ్ణుంచే మనం కలిసి పెళ్లికెళ్లొచ్చు."

మర్చిపోయిన బంధం గుర్తొచ్చి మనస్సు బరువెక్కింది. ఐదేళ్లాయె నెక్కల్లు వెళ్లి.

తన ఆలోచనలు, ఆవేదనలు పంచుకోటానికి ఆఫీసులో ఎవరూ లేరు. సబ్ ఎడిటర్ శారదారాణి మాత్రం కాస్త కలివిడిగా వుంటుంది. తను రాసిన వ్యాసాలు (స్త్రీ సమస్యలు) చూపించి అభిప్రాయం అడుగుతుంది అప్పుడప్పుడు. ఆమె సొంత సమస్యలు చెప్పుకుంటుంటే ఎందుకో తనకెంతో రిలీఫ్‌గా వుంటుంది. ఆర్ద్రతలేని, అనుమానాల వాతావరణంలో తన మనోధోరణికి సమీపంగా మరో మనిషి ఆలోచిస్తున్నందుకు కలిగే ఊరట అది.

లంచ్ టైంలో ఏమీ తోచక కాంటీన్‌కేసి వెళ్లాడు. ఇద్దరు ముగ్గురు కాఫీలు తాగుతుంటే అసోసియేట్ ఎడిటర్ విశ్వేశ్వరరావు ఎడిటర్ మీద, పరోక్షంగా కారాలు, మిరియాలు నూరుతున్నాడు. ఫలానా పత్రిక ఎడిటర్‌కి ఎట్లా ఉద్వాసన జరిగిందో చెప్తున్నాడు. సూటిగా మాట్లాడకుండా ప్రత్యక్షంగా ఎడిటర్‌ని ఖండించకుండా, అతణ్ణి పారదోలటానికి 'ప్రచారం' చేస్తూ ఇతరులకు పురెక్కించే నైజం. మౌనంగా కాఫీ తాగి వచ్చేశాడు.

ఆరున్నరకి ఇంటికి చేరేపాటికి వరండాలో స్నేహితుడు లక్ష్మీనారాయణ తనకోసం ఎదురు చూస్తుండడం ఆశ్చర్యం కలిగించింది. ఎమ్మెస్సీలో తామిద్దరూ క్లాస్‌మేట్స్. రూమ్ మేట్స్ కూడా. ఇద్దరి అభిప్రాయాలు, అభిరుచులు చాలవరకు కలిసేవి. ఇద్దరికీ లతా పాటలంటే ఇష్టం. తిలక్ కవిత్వమంటే ఇష్టం. ఇద్దరి మధ్య చర్చల్లో, కబుర్లలో గడిచిపోయిన రాత్రులెన్నో, చేయబోయే ఉద్యోగాల గురించి, చేసుకోబోయే అమ్మాయిల గురించి ఎన్నెన్ని ఊహలు చెలరేగేవి? క్రమక్రమంగా ఎవరి బ్రతుకులో వాళ్లు స్థిరపడిపోయారు. తను పత్రికలో. అతను వ్యవసాయ శాఖలో. ఉద్యోగంలో ఇబ్బందులు. కలిసిరాని భార్యతో కాపురం. మెల్లగా ఆత్మన్యూనతకి లోనయ్యాడు లక్ష్మీనారాయణ.

"ఎట్లా వున్నావు? చాలాకాలమైంది కలిసి" పలకరించాడు రామకృష్ణ

"ఆ ఏముందిలే? అంతా మామూలే" చెప్పాడు లక్ష్మీనారాయణ.

మనిషి మునుపటికన్నా నల్లబడ్డాడు. లలిత కాఫీలు తెచ్చింది. మాటల మధ్యలో వచ్చిన సంగతి బయటపెట్టాడు. కొడుకుని రెసిడెన్షియల్ కాలేజీలో డేస్కాలర్‌గా చేర్పిస్తున్నాడు. ఐదువేలు కావాలి. రామకృష్ణ దగ్గర సమయానికి అంత డబ్బు లేదు. ఏదో రకంగా ఒక వారంలో సర్దుబాటు చేస్తానన్నాడు. మరో అరగంట సేపున్నాడు లక్ష్మీనారాయణ. అన్నీ మామూలు మామూలు

మాటలు. మాటల్లో మానసిక సాన్నిహిత్యం లేదు. ఇద్దరి మధ్య ఏదో మంచు గడ్డకట్టుకు పోయినట్టయ్యింది. ఒకప్పటి ఆత్మీయత ఎక్కడ ఇగిరిపోయింది? రకరకాల సంకోచాలు, అసూయలు, స్వార్థాలు మొదలైన తెరలేవో కదుల్తాయి మనుషుల మధ్య. వాటిని తొలగించు కోవటమెట్లా? వ్యవహార సంభాషణలు సరే, హృదయాల మధ్య సంధానమెట్లా?

లక్ష్మీనారాయణ వెళ్లిపోయిన తర్వాత శుభలేఖ, ఉత్తరం లలితకి చూపించాడు రామకృష్ణ. నర్మద కూడా పక్కనే వుంది.

"చిన్ననాటి స్నేహితుడంటున్నారు గదా! తప్పకుండా వెళ్లి రండి" అంది లలిత.

"మరి శేషగిరి యింటికి? సంబంధాలు తెగిపోయి చాన్నాళ్లయింది గదా?"

లలిత మౌనం వహించింది. ఆమె కాపరానికి వచ్చిన తర్వాతే రెండు కుటుంబాల మధ్య రవరవలు మొదలయ్యాయి.

"తెగిపోయిన వాటిని ముడేసుకోగూడదా నానా?" అడిగింది నర్మద తెలివిగా.

కూతురు ఆలోచనకి ఆశ్చర్యపోయాడు రామకృష్ణ. వయస్సులో చిన్నదైనా పెద్ద మాటలు చెప్పింది. అయితే ఒకందాన నర్మద ఆలోచనని ఆమోదించలేక "ఒకవేళ వాళ్లు మన అభిమానాన్ని అందుకోకపోతే?" అనడిగాడు.

"అప్పుడది వాళ్ల తప్పవుతుంది నానా! అసలు అభిమానమే చూపకపోతే అది మన తప్పే గదా?" అంది నర్మద. రామకృష్ణ మాట్లాడకపోవటంతో "శ్యామల ఇప్పుడేం చేస్తోందో ? నా యీడే గదూ?" అనడిగింది, బాబాయి కూతుర్ని తలుచుకొంటూ.

"పోన్లెండి. ఊళ్లో దాకా వెళ్లి వాళ్లింటికి పోకపోతే బాగుండదు. పైగా అనారోగ్యం అంటున్నారు గదా? వెళ్లి పలకరించి రండి" చెప్పింది లలిత.

రామకృష్ణ ఆలోచనలో పడ్డాడు. ఎప్పుడు తల్చుకున్నా గతం గుబులుగానే వుంటుంది.

తండ్రికి మొదటి భార్య సంతానం తను. చిన్నప్పుడే తల్లి పోయింది. నాన్న మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. ఆమె కిద్దరు పిల్లలు. శేషగిరి, శకుంతల. సవతి తల్లి (సౌభాగ్యమ్మ) తననెప్పుడూ రాచి రంపాన పెట్టలేదు. కానీ చూపించే ప్రేమలో ఎక్కడో తేడా వుండేది. తండ్రి దగ్గర బిడియం తనకి. అట్లా చిన్నతనంలో ఇంట్లోనే ఒంటరితనం అనుభవించాడు తను. బయటి స్నేహితులే ఎక్కువ. ముత్యాలు, నర్సిమ్మరావు, వెంకట్రావు, హనుమంతు, పార్వతి - ఇట్లా చిన్నప్పటి స్నేహితులు ఇప్పటికీ గుర్తున్నారు.

తుళ్లూరులో హైస్కూలు. గుంటూర్లో డిగ్రీ. వైజాగ్‌లో ఎమ్మెస్సీ. జర్నలిజం మీద ఆసక్తి. హైదరాబాద్‌లో ఒక దినపత్రికలో చేరాడు. శేషగిరి ఐదో తరగతితోనే ఆగిపోయాడు. శకుంతలకి పెళ్లై లింగాయపాలెం వెళ్లిపోయింది. తనది పెద్దలు కుదిర్చిన పెళ్లే అయినా సవతి

తల్లి లలితని సరిగా చూడలేదు. శేషగిరికి కూడా పెళ్లయిన తర్వాత వేర్లు పడ్డారు. పంపకాల్లో మాట తేడాలు. తనకు చదువు, ఉద్యోగం ఉండటం వల్ల శేషగిరికి ఎక్కువ పంచమంటుంది సౌభాగ్యమ్మ. తను అంగీకరించినా తండ్రి ఒప్పుకోకుండా సమాన భాగాలు పంచాడు. ఇల్లు మాత్రం తల్లిదండ్రుల తదనంతరం శేషగిరికే చెందేట్టు తండ్రిని ఒప్పించాడు తను. అయినా బెడిసిన సంబంధాలు కుదురు కోలేదు. తన హైదరాబాద్ ఉద్యోగం వల్ల మనుషుల మధ్య, మనసుల మధ్య దూరం ఇంకా పెరిగింది. తండ్రి పోవటంతో శేషగిరి కుటుంబానికీ, తమకీ రాకపోకలు తగ్గిపోయాయి. నెక్కల్లులో శేషగిరి, భార్య, ఇద్దరు పిల్లలు, సవతి తల్లి ఉంటున్నారు. తను నెక్కల్లు వెళ్లి అయిదేళ్లు. ఇరవయ్యేళ్లనాడు హైదరాబాద్ వచ్చి పత్రికా ప్రపంచంలో అడుగుపెట్టి నప్పట్నుంచీ ఒంటరితనం జీవన విధానమైంది. ఉద్యోగ జీవితంలో సహజత్వం లేదు, భద్రత లేదు. పుట్టి పెరిగిన పల్లెటూరికీ, ఆర్ద్రతలేని నగర వాతావరణానికి పోలికే లేదు. చుట్టూతా మనుషులే. ప్రతి మనిషి చుట్టూ కనపడని కంచెలు. తొందరగా సుఖం కావాలి. అందుకోసం తొందరగా డబ్బు కావాలి. దాని కోసం పరిచయాలు. దాని కోసం పార్టీలు. దానికోసం ఆత్మస్తుతీ, పరనిందలు, దాని కోసం మాస్క్‌లు. దానికోసం అభినయాలు, అవకాశం అంది పుచ్చుకుని రఫ్‌గా, రాష్‌గా, డాషింగ్‌గా దూసుకుపోయే వ్యవహార్శైలి. ఎవడికీ ఎవడి ఆత్మతోనూ పనిలేదు. తన ఆత్మతోనూ పనిలేదు. కరచాలనం కావాలి. హృదయ చాలనం అక్కర్లేదు. ఈ వాతావరణంలో సహజంగానే తను బిగుసుకుపోయాడు. మనుషుల కంటే పుస్తకాల్లో కొంత ఉపశాంతి లభించింది. అవి మనస్సుతో పలకరిస్తాయి. మోసం చెయ్యవు. అయినా సగం మనిషి తను. జీవితంలో ఎన్నో ఖాళీలు. బాల్యంలో తల్లిప్రేమ కోల్పోయిన ఖాళీ. బాల్య, యౌవన, స్నేహాల్ని కోల్పోయిన ఖాళీ. చల్లని పల్లె ఒడికి దూరమైన ఖాళీ. సంతృప్తిలేని వృత్తి వల్ల ఏర్పడిన ఖాళీ. వీటినన్నిటినీ ఒక్క లలిత ఎట్లా పూరించగలదు?

తెల్లారి ఎడిటర్ టేబుల్ నుంచి రెండు వ్యాసాలు, మూడు కవితలు వచ్చాయి. 'రచన' కోసం పరిశీలించాలి. పైపైన చూస్తుంటే ఒక కవిత తనని ఆకర్షించింది. 'ఆవలి వైపు'. కవి శివారెడ్డి.

'బహుశా నా రెండో పక్క నీవెప్పుడూ చూచి వుండవు...
మనం చూడని మహా లోకమొకటి ఆవలివైపు ఉంటుందని గ్రహించే వుండవు....
ఎవడికైనా ఇంకొకడి ఆ రెండోపక్క తలుపులు తీసి చూసే
స్థోమత, ప్రేమా, సంబంధం వుండొద్దా....
ఒకడు ఇంకొకణ్ణి ముట్టుకోవద్దా....
ఒకడు ఇంకొకడి కడలిలోకి దూకి
ఆ అగాధ జలగర్భ సంపద బయటికి తీయవద్దా...

బహిర్గతం కండి! బుద్ధిహీనుల్లారా! బయల్పడండి

ఒకడు ఇంకొకణ్ణి తప్పి తలకెత్తుకోవాల్సిందే!

లోపలి చీకటి లోకాలన్నింటిని పద్యాన్ని చదివినట్టు చదవాల్సిందే'

కవిత చదివి గొప్ప ఉద్వేగానికి లోనయ్యాడు రామకృష్ణ. నిజం. ఎవడిలోకి ఎవడూ ప్రయాణించడు. ఎవడూ మరొకణ్ణి ముట్టుకోడు. మనుషుల మధ్య అసంబంధం. సామూహిక ఏకాంతం. ఈ మానవదూరాన్ని అధిగమించాలంటే ఎన్నెన్ని అడ్డుగోడలో? అభద్రత, భయం, అసూయ, ద్వేషం. బహుశా వీటన్నిటినీ ఆ కవి అర్థం చేసుకుని వుండాలి. కానీ తను? బహిర్గతం కాకపోవటానికి, తనలోకి తనే ముడుచుకుపోవటానికి అంతిమంగా జీవన భీతే కారణమా? అయితే దాన్ని తను జయించలేడా? ఒక్కసారి ఈ ఫైళ్లు, పత్రికలు, సంకోచాలు, బాధలు, భయాలూ విసిరికొట్టి తననుంచి తను విముక్తం కాలేడా?

❖ ❖ ❖

హైదరాబాద్ నుంచి గుంటూరు. గుంటూరు - వడ్లమాను బస్సులో నెక్కల్లు ప్రయాణం. మబ్బులు కమ్మిన శ్రావణమాసపు ఆకాశం. పైరగాలి. చుట్టూతా మోకాళ్ల దాకా పెరిగిన పైర్లు, పొలాల సువాసన. ఒక మౌలిక స్పర్శకోసం వెళ్తున్నాడు తను. తనకది దొరుకుతుందా?

చదువుకునే రోజుల్లో పదే పదే పాడుకున్న 'అందాజ్' సినిమాలో రఫీ, ఆశా పాడిన పాట పెదాల మీద కొచ్చింది.

'దిల్ ఉసే దో జో జాన్ దేదే,

జాన్ ఉసే దో జో దిల్ దేదే' (శైలేంద్ర)

(ఎవరు ప్రాణమిస్తారో వాళ్లకి హృదయమియ్యి. ఎవరు హృదయమిస్తారో వాళ్లకి ప్రాణమియ్యి).

ఇవ్వటానికి కొందరికి హృదయాలే ఉండవు. కొంతమందికి ఉన్నా ఇవ్వరు. ఇవ్వని వాళ్లకి కూడా హృదయం ఇవ్వగలగటం నిజంగా గొప్ప సంగతి.

"ఓరి వోరి నువ్వంటరా? బాగుండావా? తమ్ముణ్ణి సూట్టాని కొత్తన్నావా?" బస్సులో పలకరింపు. నగరంలో ఎక్కడా ఎప్పుడూ వినపడని పలకరింపు. తలగుడ్డ మనిషి. పెదనాన వరుస.

పెదపరిమి దాటి పది నిమిషాలు ప్రయాణించి నెక్కల్లులో ఆగింది బస్సు. ఎక్కడో సన్నాయి మేళం వినపడుతుంది. మనసు కరిగించే కల్యాణి రాగం.

పడమటి వీధిలో అదే పాతబడ్డ పెంకుటిల్లు. ఇంటిముందు అదే వేపచెట్టు. ప్రహరీ గోడ ఒక పక్కన పడిపోయింది. పంచలో మంచంలో శేషగిరి పడుకోనున్నాడు. తనను చూడంగానే ఆశ్చర్యంగా లేచి కూర్చున్నాడు. పక్కనే ఉన్న నల్లకుక్క తనని చూసి మొరగబోయి ఆగింది. అన్నేళ్ల తర్వాత కూడా గుర్తుపట్టి తోకాడిస్తూ దగ్గరికొచ్చింది.

"ఎట్లా వున్నావ్‌రా శేషూ?" మంచం మీద అతని పక్కనే కూర్చుంటూ అడిగాడు. శేషగిరి ఏమీ మాట్లాడకుండా తనని వాటేసుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. స్పర్శ. రక్తస్పర్శ.

"ఓయ్ రాజీ!" అని కేకేశాడు శేషగిరి భార్యని. వంటింట్లోంచి చేతులు తుడుచుకుంటూ వచ్చింది రాజేశ్వరి. ఒక్కక్షణం కంగారు. మరుక్షణం తన మొహం చాటంతయ్యింది. "అంతా బాగుండారా బావా?" అని పలకరించి కాళ్లకి నీళ్లిచ్చింది. మంచం వాల్చి కొత్త దుప్పటి పరిచింది. కాఫీ పెట్టటానికి మళ్లీ లోపలికెళ్లింది. ఇంతలో పక్కింటి నుంచి సవతితల్లి సౌభాగ్యమ్మ, శేషగిరి కూతురు శ్యామల వచ్చారు.

"ఏం నాయనా బాగుండావా? ఇన్నాళ్లకన్నా గుర్తొచ్చాం. కోడలూ, పిల్లదీ ఎట్టుండారు?" అని మొదలుబెట్టింది సౌభాగ్యమ్మ. ఎప్పటి ధోరణే. వయస్సుడిగినా మాటలో అదే పెడసరం.

శ్యామల నవ్వుతూ వచ్చి తన పక్కనే కూర్చుంది. 'ఎక్కడికెళ్లా?' అనడిగాడు. చేతిలో గిన్నె చూపించింది. నూరిన గోరింటాకు. 'ఏం చదువుతున్నా'వని అడిగాడు. టెన్త్ క్లాసని చెప్పింది. నర్మద కూడా అదే క్లాసు. మొహంలో ఎక్కడో నర్మదకి, శ్యామలకీ పోలికలు కన్పిస్తున్నాయి. కాకపోతే నర్మదది నగరవాసం నిగారింపు, శ్యామలది చామనచాయ.

"అక్కాయ్‌ని తీసుకురాలేదేంది పెదనానా?" అనడిగింది శ్యామల. తను నవ్వి ఊరుకున్నాడు. రాజేశ్వరి కాఫీ తెచ్చిచ్చింది.

శేషగిరి ఆరోగ్యం సంగతి అడిగాడు రామకృష్ణ. రాజేశ్వరి అట్లాగే నిలబడి చెప్పింది. కొంతకాలంగా బి.పి. వుంది శేషగిరికి. పోయినేడు పంటల్లో నష్టం. అప్పు, ఆందోళనతో గుండెపోటు వచ్చింది. గుంటూర్లో వైద్యం. ఇప్పుడిప్పుడే కాస్త కోలుకొంటున్నాడు.

"ఇంత జరిగితే నాకెందుకు కబురు చెయ్యలా?"

రామకృష్ణ ప్రశ్నకి రాజేశ్వరి బదులు చెప్పలేదు. "అప్పటికీ నేనంటానే వుండా నాయనా!" అందుకుంది సౌభాగ్యమ్మ గడప దగ్గర చతికిలబడుతూ. "ఎనకటి ఆపేక్షలు ఇంకా ఉండయ్యో లేదోనని వాళ్ల కనుమానం. మీ నాన బతికుంటే ఆ పద్దతే యేరుగా వుండేది. నేనేమో సవతి తల్లినాయె. నిన్ను సదివించటానికి ఎన్ని అవస్థలు పడ్డామో, తిన్నామో తినలేదో ఆ దేవుడికే తెలవాల! నువ్వేమో నౌకరీ కోసం దేశంమీద బొయ్యావు. ఎనకటి ప్రేమలు ఉండమంటే ఉంటయ్యా? అడ్డాలనాడు బిడ్డలు గానీ, గెడ్డాల నాడు బిడ్డలు గాదుగా? ఏదో మా భ్రమగాని."

"అయ్యన్నీ ఇప్పుడెందుకే?" అన్నాడు శేషగిరి తల్లిని వారిస్తూ.

సవతి తల్లి పుల్లవిరుపు మాటలు రామకృష్ణకి కొత్తకాదు. నిబ్బరంగా ఉండిపోయాడు. రాజేశ్వరి వంట పనిమీద లోపలికెళ్లింది.

"అమా! గతాన్ని తవ్వుకునేవాళ్లకి భవిష్యత్తు ఉండదంటారు. ఏం జరిగిందో జరిగిపోయింది. నాలుగు రోజుల కిందట తాటి వెంకట్రావు శుభలేఖ పంపిస్తూ ఉత్తరం రాస్తే

శేషు సంగతి తెలిసింది. ముందు వీణ్ణి హైదరాబాద్ తీసికెళ్లి, మంచి డాక్టర్లకి చూపిద్దాం. నువ్వూ రా. కోడల్ని, మనవరాళ్ళీ చూసినట్టూ వుంటది" చెప్పాడు నిదానంగా.

దాంతో వెనకటి బింకం కరిగిపోయింది సౌభాగ్యమ్మలో. "పానీలే నాయనా! అమ్మ కడుపు సల్లగా మంచి మాటన్నావు. అంతే సాలు" అని కన్నీళ్లొత్తుకుంది. "లే. లేసి కాళ్లు గడుక్కో. ఎంగిలి పడుదువు గాని. ఎప్పుడు తిన్నావో యేందో."

రామకృష్ణ కుదుటపడ్డాడు. మనస్సులో ఒక గడి తొలగిపోయినట్టుంది.

ఇంతలో వీధిలోంచి "పిన్నాం! మన రాముడొచ్చాడంటగా?" అనడుగుతూ ముత్యాలు పంచలోకి వచ్చాడు. చిన్నప్పటి సావాసగాడు. ఒక కన్ను సరిగా కనపడదు. ఓరగా చూస్తూ పలకరించాడు. "వార్నీ! అప్పుటికీ యిప్పుటికీ శానా మారిపొయ్యావే? బువ దిన్నావా యేంది? ఎంకట్రావు నిన్ను లాక్కు రమ్మన్నాడు పప్పన్నానికి."

"తాళు. పిల్లడు రాకరాక యింటికొత్తే ఆడేందో బోజనానికి దీసికెల్తానంటావేందిరా గుంటడా? రేత్రికి పెళ్లి బోజనం జేత్తాళ్లే, అమ్మాయ్, వంటయ్యిందా?" అని కేకేసింది సౌభాగ్యమ్మ.

కాస్త చల్లబడ్డాక వెంకట్రావు ఇంటికి రమ్మని చెప్పి వెళ్లాడు ముత్యాలు. అక్కణ్ణుంచే అందరూ పెళ్లికి కలిసే వెళ్లొచ్చు. అన్నాలైన తర్వాత శేషగిరిని ఇంటి సంగతులడిగాడు రామకృష్ణ. ఆర్థిక పరిస్థితి అంత బాగున్నట్టు లేదు. ఆ యేటితో శ్యామల చదువు ఆపిస్తానన్నాడు. రామకృష్ణ ఒప్పుకోలేదు. కాకపోతే తమ యింట్లోనే ఉండి చదువుకుంటుంది. ఒక వారంలో రాజేశ్వరితో పాటు హైద్రాబాద్ వస్తానన్నాడు శేషగిరి. ఇంతట్లో శ్యామల తమ్ముడు సదాశివ బజార్లో ఆటలు చాలించి ఇంటికొచ్చాడు. పెదనాన్న కనపడగానే వదిలి పెట్టలేదు. వాడికో బొమ్మ పిస్తోలు, శ్యామలకి పెన్నూ ఇచ్చాడు రామకృష్ణ. పిల్లల సంతోషం చూస్తుంటే ఇన్నేళ్లు వాళ్లకు ఎడమైనందుకు విచారించాడు.

సాయంత్రం ఇంట్లో అందరికీ వస్తానని చెప్పి వెంకట్రావు ఇంటికి బయలుదేరాడు రామకృష్ణ. రాములవారి గుడి దగ్గరే యిల్లు. ఇంటిముందు కొత్త తాటాకుతో పందిరేశారు. పందిరి నిండా రంగు రంగుల కాగితాలు. కింద పరదా పట్ట పరిచారు. అయినవాళ్లు, తెలిసినవాళ్ళు, పిల్లా జెల్లా - అంతా సందడి సందడిగా వుంది. రామకృష్ణ కన్పించగానే సంతోషపడ్డాడు వెంకట్రావు. ఇంటి సంగతులు అడిగాడు. ముత్యాలు, హనుమంతు, నర్సిమ్మరావు పందిట్లో పెద్దలకి కాఫీ, ఫలహారాలందిస్తున్నారు. ఒక మంచినీళ్ల గ్లాసు నిండా కాఫీ తెచ్చాడు హనుమంతు. 'అమ్మో! ఇన్ని కాఫీయా?' అని ఆశ్చర్యపోయాడు రామకృష్ణ.

"ఏహె తాగవాయ్! మన నర్సిమ్మ ఇందాకే ఆ గళాసుతో రెండు గళాసులు పట్టిచ్చాడు" అన్నాడు హనుమంతు చనువుగా. రామకృష్ణ నవ్వుతూ గ్లాసు అందుకున్నాడు.

రాత్రి తొమ్మిదిన్నరకి తుళ్లూర్లో పెళ్లి. పెళ్లికొడుకు కార్లోనే రామకృష్ణని కూడా

రమ్మన్నాడు వెంకట్రావు. "నువ్వు నడుత్తానంటే పొలాల మీదగా సరదాగా యెల్దాం" అన్నాడు ముత్యాలు.

రామకృష్ణ సరేనన్నాడు. ముత్యాలు, హనుమంతు తోడుగా బయల్దేరారు. ఎంత పెళ్ళి నడక నడిచినా పొద్దుగూకే లోపల తుళ్ళూరు చేరుకోవచ్చు. వానొచ్చే కళ లేదు.

ఊరమ్మట చెరువుగట్టు మీదగా ఉత్తరదిక్కునే మళ్ళీగా వాగు అడ్డం వచ్చింది. పెద్దగా నీళ్ళు లేవు. అక్కడక్కడా చిన్న చిన్న చేపలు ఈదుతున్నాయి. వాగు దాటంగానే చేలు. జొన్న, పెసర, నువ్వు - అంతా పచ్చపచ్చగా....

పొలాల గట్ల మీదగా దారి. పక్కనే డొంక. పాతికేళ్ళ కిందట ఈ దారమ్మటే హైస్కూలు చదువుకోసం తుళ్ళూరు నడిచి వెళ్ళారు. ఇప్పటికీ అదే ప్రకృతి. వాగులూ వంకలు. బీళ్ళూ, ముళ్ళూ.

"ఆ లోపల చొక్కా తీసెయ్యరాదా? కొత్త గాలాడిద్ది" అన్నాడు ముత్యాలు. నిజమే, 'టక్' చేసుకుని వుండటం వల్ల ఫ్రీగా నడవలేకపోతున్నాడు. షర్ట్ పైకి లాగేస్తే హాయిగా వుంది. నడక సహజంగా వుంది.

తుమ్మలబీడు దాటుతుంటే చిన్నప్పుడు ఆ బీట్లో ఒంటరిగా నడవాలంటే ఎంత భయపడేవాడో గుర్తొచ్చింది రామకృష్ణకి. ఎండాకాలం బీట్లో కిక్కిరిసిన తుమ్మచెట్ల గుండా గాలి విచిత్రంగా శబ్దం చేసేది. ఒక్కోసారి సుడి తిరిగి లేచేది. అక్కడ దెయ్యాలుంటాయని భయం. ఇప్పుడా భయం లేదు. భయమల్లా నగరంలో సన్నిహితుల మధ్య మసలుతున్నప్పుడే. ఏ వ్యక్తీ పూర్తిగా వ్యక్తం కానందువల్ల భయం. ఏ ప్రమాదం ఎవడి నుంచి వస్తుందో తెలీని భయం. ఇక్కడ ముందు ముత్యాలు, వెనక హనుమంతు. మధ్యగా తను నడుస్తుంటే భద్రతే తప్ప భయం లేదు.

ఆ కనపడే చేల్లోనే గదా ఒకప్పుడు పెసరగాయలు గోసినందుకు పొలం రైతు కర్ర తీసుకొని వెంటబడింది? ఇప్పుడూ అదే పెసర చేను. గట్టున ఎవరో ముసలాయన. ఆయన్ని అడిగి కాసిని కాయలు గోసుకున్నాడు.

సగం దూరం నడిచేపాటికి జోడుచింతలు తగిలాయి. పక్కనే కుంట. పెసరకాయలు తిని అందులో నీళ్ళు దాగారు. హనుమంతు చింత చెట్టెక్కి, కాసిని వానగాయలు కోశాడు. నిన్నో మొన్నో వాన పడి వుండాలి. నల్లనేల తడి పొడిగా ఉంది. దూరంగా పడమటన అనంతారం కొండలు. కొండల అవతల వంగిన సూర్యుడు. శ్రావణ మాసం మబ్బుల్తో రంగుల పటమల్లే పడమటి ఆకాశం. వాన తూనీగలు. మనిషి బహిర్గతుడు కావటానికి అంత కన్నా గొప్ప వాతావరణం అక్కర్లేదు. చిన్నప్పటి గోలీలాటల దగ్గర్నుంచి ఉద్యోగందాకా ఎన్నో సంగతులు వాళ్ళతో ముచ్చట్లాడాడు రామకృష్ణ నడుస్తూనే. మాట్లాడే కొద్దీ పైన బరువేదో దిగిపోతున్నట్టనిపించింది. ఈ నాలుగైదేళ్ళలో ఊళ్లో వచ్చిన మార్పులు - పెళ్లిళ్ళు, తగాదాలు, లేచిపోవటాలు, చచ్చిపోవటాలు, పైరు పంటలు అన్నిటి గురించీ చెప్పాడు ముత్యాలు. అవి కొంత అనవసరంగా,

కొంత అవసరంగాను తోచాయి రామకృష్ణకి.

"చెల్లియొ చెల్లకో తమకు చేసిన యెగ్గులు సైచి రందరున్, తల్లి గతించె, నేడు నను దూతగ బంపెరి సంధిసేయ...." ఉండుండి పద్యమందుకున్నాడు హనుమంతు. కంగుమనే గొంతు.

"ఎహ్హెహ్హే" నవ్వాడు ముత్యాలు.

"ఏందిరా నవ్వుతావు?" అడిగాడు హనుమంతు.

"తల్లి గతించె కాదురా, 'తొల్లి గతించె' అనాల."

"అయితే మాలె, పాడనీ" అన్నాడు రామకృష్ణ. తనకీ హుషారుగా ఉంది.

"ఈడి పద్యాలు ఇనలేకే పెళ్లాం లేసిపొయ్యింది" చెప్పాడు ముత్యాలు నవ్వుతూ.

"పోవాయ్ పుల్లాయ్! ఆళ్ల లక్షింనరుసు పెళ్లాం లేసిపోలేదా యేంది? అయినా నువ్వు పాడు సూద్దాం."

చూడబోతే హనుమంతు తన భార్య లేచిపోవటం ఆత్మన్యూనతగా భావిస్తున్నట్టు లేదు. అటువంటివి వెల్లడి చెయ్యగూడదనీ. బహుశ వాడికి 'అహంభావ' సమస్య లేదేమో. ముత్యాలు తలగుడ్డ దులిపి, మళ్లీ చుట్టుకొని, "కాసుకో" అన్నాడు. రామకృష్ణ వంక ఓరగా చూశాడు.

'ఏందుకో ననుకుంటె - గోంగూరకీ
నేనెందుకో ననుకుంటె - గోంగూరకీ
మాయదారి నా బట్ట - గోంగూరకీ....'

ఒకప్పుడు అది తన దృష్టిలో పచ్చి బూతుపాట. ఇప్పుడు అదొక సహజమైన వ్యక్తీకరణగా అన్పించింది. అదయిపోగానే ఎప్పుడో చిన్నప్పుడు తన గొంతులో ఇరుక్కుపోయిన పాట ఒకటి అనుకోకుండా బయటికొచ్చింది.

'నీకూ నీ వారు లేరూ - నాకూ నా వారు లేరూ
తెప్పమీదా తేలిపోదాం పదరా
చల్ మోహనరంగా....'

తన గొంతు తనకే కొత్తగా, వింతగా ఉంది. అయినా పాడేకొద్దీ మనస్సు అందులో లీనమైపోయింది. ఏదో ఎక్కడో బందిఖానా నుంచి విముక్తి పొందుతున్న అనుభూతి. చిన్నప్పుడు ఎన్నో రాగాలు తీసిన గొంతుకు నగరంలో స్థిరపడగానే గడిపడింది. బజార్లోనూ, బస్సులోనూ, ఆఫీసులోనూ ఎక్కడ కూనిరాగం తీసినా ఎంత 'ఆక్వర్డ్'గా ఉంటుంది?... కానీ నిజానికి పాట ఆక్వర్డ్ కాదు. పాట గొంతు నొక్కే నాగరికతే ఆక్వర్డ్. హాయిగా విప్పారని ఆధునికజీవితమే ఆక్వర్డ్.

పాట ఆగిపోగానే ముత్యాలు తనని కావిలించుకున్నాడు. "నువ్విట్టా అప్పుడప్పుడు మనూరు రావాల. మనం పాటలు పాడుకోవాల".

తనకి కళ్లనీళ్లు నిండాయి. స్పర్శ. మానవ స్పర్శ. ఇక్కడ మనుషులున్నారు. రాగద్వేషాలున్నా ప్రేమించగల మనుషులున్నారు. ఇక్కడ తనకి జీవనభీతి లేదు.

"ఐ వోంట్ స్పేర్ యూ రామకృష్ణా! యూ విల్ బీ..." బట్టతల ఎడిటర్ కళ్లముందు కనబడుతున్నాడు.

"పోవాయ్ ఫుల్లాయ్!" అంటాడు తను.

కలబంద డొంక దాటారు. రామకృష్ణకి కాళ్లు లాగుతున్నాయి. అలవాటు లేని నడక. అల్లంత దూరంలో చెరువు. ఆడదాని చెరువు. దానికా పేరెందుకు వచ్చిందో తెలీదు. పాతికేళ్ల కిందట ఎట్లా తుమ్మలు పెరిగి, నీళ్లు నిండి, విశాలంగా, కొంగల్తో, కాకుల్తో కలకల లాడేదో ఇప్పుడూ అట్లాగే. ఎంతోకాలంనుంచి తనకోసం ఎదురు చూస్తున్నట్టు. 'ఉత్తతీత' అంటూ ఒక పిట్ట ఎగిరిపోయింది. కట్టకి దిగువన, దూరంగా తుళ్లూరు కనబడుతూంది. ఒకప్పుడు ఈ చెరువులోనే ముత్యాలు, హనుమంతుతో కలిసి స్కూల్ ఎగ్గొట్టి దిసమొలతో ఈతేశాడు.

"అరేయ్ ముత్యాలూ! చెర్లో ఈతేద్దాంరా" అడిగాడు హఠాత్తుగా.

"ఈతా? ఇప్పుడా? పెళ్లి కెళ్లొద్దూ? ఒకేపున పొద్దుగూకుతుంది" అన్నాడు ముత్యాలు.

"అయితే మాలె" అన్నాడు రామకృష్ణ

"మరి నీ కొత్త బట్టలు?" అడిగాడు హనుమంతు.

"జానే దేవ్".

చెరువు పిలుస్తుంది. ప్రకృతి పిలుస్తుంది. ఈ చదువు, తెచ్చుకోలు నాగరికత అబద్ధం. కుక్కబతుకు ఉద్యోగం అబద్ధం. ఈ మబ్బులు పట్టిన ఆకాశం, ఆకాశం కింద నల్లరేగడి పొలాలు, వాన తుంపర్లు, ఈ పిట్ట, చెట్టు, చెరువు - ఈ సమస్త ప్రకృతి - ప్రకృతి ఒక్కటే నిజం. భ్రమలు, బాధలు, ఆత్మన్యూనత, అవమానం. అభద్రత - అన్నిట్లోంచి బయటికి రా. ఓపెన్ ద డోర్! ఓపెన్ ద హార్ట్! ఓపెన్ సెసేమ్!

రామకృష్ణ షర్ట్ విప్పేశాడు. పాంటు తీసేశాడు. లోదుస్తులు - అన్నీ! ఒక్కసారిగా గట్టు మీద నుంచి నిలువులోతు నీళ్లల్లోకి ఎగ్గిరి దూకాడు. హనుమంతు, ముత్యాలు వింతగా చూస్తూ నీళ్లల్లోకి దిగారు. ముత్యాలు 'కయ్'మంటూ ఈలేశాడు.

చల్లని నీళ్లు రామకృష్ణని కావిలించుకున్నాయి. అవయవాలన్నిటినీ తడిమాయి. స్పర్శ. ప్రకృతి స్పర్శ. రామకృష్ణ మనస్సు నిర్వికారంగా, ప్రశాంతంగా, కలత లేకుండా, కళంకం లేకుండా, ఆహ్లాదంగా, ఆనందంగా ఉంది. నగ్నంగా సహజంగా ఉంది. రెండు చేతులూ, రెండు కాళ్లూ స్వేచ్ఛగా కదిలిస్తూ తననుంచి తనే విముక్తమవుతూ.... ఎంతోసేపు అట్లాగే చెరువులో అటూ ఇటూ అలల్లో అలగా కదుల్తూ.... అలా....అలా....